# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 16-04-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- రాజ్యాంగ సవరణల కోసం ఉద్దేశించిన పార్లమెంటు ప్రత్యేక బడ్జెట్ సమావేశాలు ఈరోజు తిరిగి ప్రారంభమయ్యాయి.
- దేశాభివృద్ధిలో మహిళాశక్తి కీలక పాత్ర పోషిస్తోందని, విధాన రూపకల్పనలో వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించడం అత్యవసరమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- మహిళా రిజర్వేషన్ బిల్లు ద్వారా లోక్ సభలో మహిళలకు 272 స్థానాలు లభిస్తాయని కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘ్ వాల్ తెలిపారు.
- నియోజకవర్గాల పునర్విభజన అనంతరం దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్య శాతంలో పెద్దగా మార్పు ఉండదని హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు.
- ముంబయి వాంఖడే స్టేడియం వేదికగా.. పంజాబ్ కింగ్స్, ముంబయి ఇండియన్స్ జట్ల మధ్య ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = =

మూడు రోజుల పాటు పొడిగించిన పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఈరోజు ఉదయం తిరిగి ప్రారంభమయ్యాయి. ఈ నెల 18వ తేదీ వరకు ఈ ప్రత్యేక సమావేశాలు కొనసాగనున్నాయి. ప్రధానంగా నారీ శక్తి వందన అధినియమ్ చట్టానికి సంబంధించిన రాజ్యాంగ సవరణలపై ఈ సమావేశాలు దృష్టి సారిస్తున్నాయి. మహిళా రిజర్వేషన్లకు సంబంధించి 131వ రాజ్యాంగ చట్ట సవరణ బిల్లును కేంద్ర న్యాయశాఖా మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ లోక్ సభలో ఈ ఉదయం ప్రవేశపెట్టారు. అనంతరం నియోజకవర్గాల పునర్విభజన బిల్లును కూడా ఆయన సభ ముందుకు తీసుకొచ్చారు. మొదట ఈ బిల్లులను సభలో ప్రవేశపెట్టడాన్ని విపక్షాలు వ్యతిరేకించాయి. మహిళా రిజర్వేషన్లను నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టడాన్ని తప్పుబట్టాయి. ఈ క్రమంలో రాజ్యాంగ సవరణ బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో ప్రభుత్వానికి అనుకూలంగా మెజార్టీ రావడంతో 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై చర్చ చేపట్టారు. ఈ చర్చలో వివిధ పార్టీలకు చెందిన సభ్యులు మాట్లాడి తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, టీఎంసీ, MIM, CPI ఇతర విపక్షాలు బిల్లును వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఓటింగ్‌కు ముందు బిల్లులపై సుదీర్ఘ చర్చ జరుగుతుందని స్పీకర్ ఓం బిర్లా వెల్లడించారు. బిల్లులపై సభ్యులు ఎన్ని గంటలు కోరినా చర్చ జరపవచ్చని, సభలో సభ్యులందరికీ సమయం ఇస్తామని చెప్పారు. ఈ మూడు బిల్లులపై రేపు సాయంత్రం 4 గంటలకు ఓటింగ్ జరుగుతుందని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశ జనాభాలో యాభై శాతానికి పైగా ఉన్న మహిళాశక్తిని నిర్ణయాధికారంలో భాగం చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. దేశాభివృద్ధిలో నారీశక్తి కీలక పాత్ర పోషిస్తోందని, విధాన రూపకల్పనలో వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించడం అత్యవసరమన్నారు. నారీశక్తి వందన అధినియమ్ చట్ట సవరణలకు సంబంధించిన మూడు కీలక బిల్లులపై లోక్‌సభలో ఈరోజు జరిగిన చర్చలో నరేంద్రమోదీ మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్లను తీసుకురావడంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని స్పష్టం చేశారు. డీలిమిటేషన్ వల్ల ఏ రాష్ట్రానికీ అన్యాయం

జరగదని పేర్కొన్నారు. ఇది దేశ ప్రజాస్వామ్యానికి ప్రయోజనకరంగా ఉంటుందని, బిల్లు ఆమోదానికి సహకరించాలని విపక్షాలకు విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి చెందిన భారతదేశం కేవలం మౌలిక సదుపాయాలు, రైల్వేలు, ఆర్థిక సూచికలకే పరిమితం కాదని, మహిళల సమాన భాగస్వామ్యం కూడా అవసరమని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్...28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

మహిళా రిజర్వేషన్ బిల్లుతో ఎవరికీ నష్టం జరగదని, ఈ బిల్లు ద్వారా లోక్ సభలో మహిళలకు 272 సీట్లు లభిస్తాయని కేంద్ర న్యాయ శాఖా మంత్రి అర్జున్ రామ్ మేఘ్ వాల్ తెలిపారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పునర్విభజించేందుకు వీలుగా కేంద్రం మూడు బిల్లులను లోక్ సభలో ఈరోజు ప్రవేశపెట్టింది. అనంతరం వీటిపై చర్చ చేపట్టారు. ఈ సందర్భంగా అర్జున్ రామ్ మేఘ్ వాల్ మాట్లాడుతూ, మహిళా రిజర్వేషన్ల అమలుతో ఏ రాష్ట్రానికి నష్టం జరగబోదని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్లను అమలు చేయాల్సిన సమయం వచ్చిందని ఆయన వ్యాఖ్యానించారు. ఆర్టికల్ 368 ద్వారా ప్రజలకు ఉపయోగకరమైన నిర్ణయాలు తీసుకోవడానికి పార్లమెంటుకు రాజ్యాంగం అవకాశం కల్పించిందని అందులో భాగంగానే ఈ మూడు బిల్లులను ప్రవేశపెట్టామని అర్జున్ రామ్ మేఘ్ వాల్ వివరిస్తూ...

(వాయిస్...29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

నియోజకవర్గాల పునర్విభజన అనంతరం దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్య శాతంలో పెద్దగా మార్పు ఉండదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. డీలిమిటేషన్ బిల్లుపై విపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని ప్రచారం చేస్తూ విపక్షాలు ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నాయని చెప్పారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుపై లోక్‌సభలో జరిగిన చర్చ సందర్భంగా అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత దక్షిణాది రాష్ట్రాలకు ప్రయోజనం చేకూరుతుందే తప్ప అన్యాయం జరగదని వెల్లడించారు. 5 దక్షిణాది రాష్ట్రాల్లో కలిపి ప్రస్తుతం 129 లోక్ సభ నియోజకవర్గాలు ఉన్నాయని అవి డీలిమిటేషన్ తరువాత 195 అవుతాయి కానీ ఆయా రాష్ట్రాల ప్రాతినిధ్య శాతంలో మాత్రం మార్పు లేదని అమిత్ షా వివరిస్తూ...

(వాయిస్...30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ ఆత్మ దేశ భాషల ద్వారానే వ్యక్తమవుతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. మహారాష్ట్రలోని వార్ధాలో జరిగిన మహాత్మాగాంధీ అంతర్జాతీయ హిందీ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవానికి ద్రౌపదీముర్ము ముఖ్యఅతిథిగా ఈరోజు హాజరయ్యారు. భారతీయ భాషలే దేశాభివృద్ధికి పునాది అని, నూతన విద్యా విధానం ద్వారా దేశం సరైన దిశలో పయనిస్తోందనన్నారు. ఈశాన్య ప్రాంతంతో సహా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల విద్యార్థులు ఈ విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసిస్తుండటంపై రాష్ట్రపతి హర్షం వ్యక్తం చేశారు. ఈ అంతర్-భాషా సమ్మిళితత్వం హిందీతో సహా అన్ని భారతీయ భాషల పురోగతికి దోహదపడుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఇతర భాషలను నేర్చుకోవాలని, అయితే మాతృభాషను ఎప్పటికీ మరచిపోకూడదని పేర్కొన్నారు. విద్యార్థులు భారతీయ జ్ఞాన వ్యవస్థను పునరుద్ధరించాలని, మాతృభాషకు గౌరవం ఇవ్వాలని కోరారు. అంతకుముందు రాష్ట్రపతి వార్ధాలోని సేవాగ్రామ్ ఆశ్రమాన్ని సందర్శించి మహాత్మాగాంధీకి నివాళులర్పించారు.

= = = = = = = = = = = = = = = = = = =

ఆస్ట్రియా ఛాన్సలర్ క్రిస్టియన్ స్టాకర్ భారత పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీతో ఈరోజు సమావేశమయ్యారు. న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్ లో ఇరువురు నాయకులు ప్రతినిధి స్థాయి చర్చలు జరిపారు. ఆహార భద్రత, సైనిక సహకారం, ఉగ్రవాద నిరోధానికి సంబంధించి ఇరు దేశాల మధ్య ఈ సందర్భంగా పలు అవగాహన ఒప్పందాలు కుదిరాయి. క్రిస్టియన్ స్టాకర్ పర్యటన వివరాలను విదేశాంగ మంత్రిత్వ శాఖ (పశ్చిమ) కార్యదర్శి సిబి జార్జ్ పాత్రికేయులకు వెల్లడించారు. ఈరోజు జరిగిన సమావేశంలో నరేంద్రమోదీ, క్రిస్టియన్ స్టాకర్ లు పశ్చిమ ఆసియాలోని ఇటీవలి పరిణామాలకు సంబంధించిన ఆందోళనకర అంశాలపై చర్చించారని జార్జ్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఐపీఎల్ క్రికెట్ లో భాగంగా ముంబయిలోని వాంఖడే స్టేడియం వేదికగా.. పంజాబ్ కింగ్స్, ముంబయి ఇండియన్స్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన పంజాబ్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన ముంబయి జట్టు 10 ఓవర్లు పూర్తయ్యేసరికి 2 వికెట్లు కోల్పోయి 97 పరుగులు చేసింది. ఓపెనర్ క్వింటన్ డికాక్ 56పరుగులు, నమన్ ధీర్ 38పరుగులతో క్రీజులో కొనసాగుతున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

జనగణన-2027 మొదటి దశలో భాగంగా ఇళ్ల జాబితా, గృహ గణన (HLO) క్షేత్రస్థాయి కార్యకలాపాలు దేశంలోని పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఈరోజు ప్రారంభమయ్యాయి. అండమాన్ నికోబార్ దీవులు, గోవా, కర్ణాటక, లక్షద్వీప్, మిజోరం, ఒడిశా, సిక్కింతో పాటు జాతీయ రాజధానిలోని NDMC, ఢిల్లీ కంటోన్మెంట్ బోర్డ్ ప్రాంతాలలో ఈ ప్రక్రియ కొనసాగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =